క్లుప్తంగా

5 నుంచి సంగీత ఉత్సవాలు

విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు జయంతి ఉత్సవాల సందర్భంగా స్వరఝరి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో 5వ తేదీ నుంచి 9 వరకు సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి మోదుమూడి సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్‌లోని శివరామ కృష్ణ క్షేత్రంలో జరిగే ఉత్సవాల్లో తొలి రోజు కె.సుధీర్ శర్మ (ఆస్ట్రేలియా), 6న కమల దీప్తి (చెన్నై), 7న సాతూర్ కృష్ణరామ రత్నం, 8న మోదుమూడి సుధాకర్, 9న అన్నవరపు రామస్వామి (వయోలిన్) సంగీత కచేరీలు నిర్వహిస్తారని తెలిపారు.

రూ. 8.9 లక్షల వ్యయంతో యూజీడీ పనులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 28వ డివిజన్‌లో పాడైన యూజీడీ పైపులైన్ పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ వీర మాచనేని లలిత కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భానునగర్ సూరిబాబు వీధిలో రూ. 4.29 లక్షలు, ముత్యాలంపాడు డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్ సమీపంలో రూ. 4.61 లక్షల వ్యయంతో యూజీడీ పైపులైన్‌లు, మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశించిన సమయంలో పనులు పూర్తిచేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో నాయకులు ద్వారక రామారావు, రామకృష్ణ, ఏఈ నాగరాజు, లోకేష్ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: నగర సాంస్కృతిక, కళా సంస్థల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్త పూర్ణానందం కళావేదికపై సోమవారం గాయని పావని మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. విశ్రాంత పోలీస్ అధికారి కె. డేవిడ్ రాజు మాట్లాడుతూ గాయని పావని కొన్ని చలన చిత్రాలలో పాటలు కూడా పాడారన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. తెలుగు కళావాహిని చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ తన సంస్థ ద్వారా అనేక మంది నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పరుచూరి విజయలక్ష్మి, డాక్టర్ దామోదర గణపతిరావు, బీవీ వీరభద్రరావు, కొప్పుల ఆనంద్, కె. రాజు, ఎం. రమణారావు పాల్గొన్నారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు.

ఆర్చరీ పోటీల్లో విజయవాడ క్రీడాకారుల సత్తా



విజయవాడస్పోర్ట్స్: ట్రెడిషనల్ ఆర్చరీ జాతీయ పోటీల్లో విజయవాడ క్రీడాకారులు సత్తా చాటారు. తమిళనాడులోని దిండిగుల్‌లో ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన ఈ పోటీలకు సిరిగి సురేష్, ప్రశాంత్, అద్విత రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించారు. సీనియర్స్ పురుషుల విభాగంలో సిరిగి సురేష్, అండర్-7 బాలుర విభాగంలో ప్రశాంత్, బాలికల విభాగంలో అద్విత బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ప్రతిష్టాత్మకమైన జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ ట్రెడిషనల్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి ఎ.నాగేశ్వరరావు అభినందించారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి మరిన్ని పతకాలు తీసుకొచ్చేలా రాష్ట్ర క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

సందడిగా సెమీ క్రిస్మస్ వేడుకలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): క్రీస్తు జననం ఈ లోకానికి పర్వదినమని పాస్టర్ రాగల మోషే అన్నారు. స్థానిక 59వ డివిజన్ సింగ్‌నగర్ లూనా సెంటర్లోని అహరోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య ప్రసంగికులుగా హాజరైన పాస్టర్ మోషే మాట్లాడుతూ డిసెంబర్ నెల అంటేనే క్రిస్మస్ పండుగ నెల అని.. ప్రపంచ వ్యాప్తంగా లోక రక్షకుడైన యేసుక్రీస్తు ప్రభువు జన్మదిన వేడుకలను అత్యంత వైభవంగా జరుకుంటారని తెలిపారు. క్రిస్మస్ పండుగతో ప్రతి ఒక్కరి ఇంటిలో నూతన వెలుగు నిండాలని ప్రార్థించారు. ముందుగా శాంతా క్లాజ్ వేషధారణలో చిన్నారులు వేసిన సాంస్కృతిక కార్యక్రమాలు.. క్రైస్తవ విశ్వాసులు ఆలపించిన గీతాలు అందరిని అలరించాయి. అంతరం క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించారు. పాస్టర్ రాగాల జక్కరయ్య, జాషువా తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో చీకట్లు.. జనాలకు ఇక్కట్లు!

సింగ్‌నగర్ ప్రాంతంలో వెలగని వీధి దీపాలు

- వరదల తర్వాత పరిస్థితి తీవ్రం
- పెచ్చుమీరుతున్న ఆకతాయిల ఆగడాలు
- పట్టించుకోని అధికారులు



సింగ్‌నగర్‌లో వెలగని వీధిలైట్లతో అంధకారంగా మారిన రహదారి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, పాయకాపురం, ఉడాకాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మహిళలు, చిన్నపిల్లలు అంధకారంలో నడవడానికి భయపడుతుండగా.. వాహనదారులు ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు.

ఈ రోడ్లపై ప్రయాణం సాహసమే..

సింగ్‌నగర్ లూనాసెంటర్, ఎంకే బేగ్ స్కూల్ రోడ్డు, లెనిన్‌సెంటర్, వివేకానంద స్కూల్ రోడ్డు, సెయింట్ ఆన్స్ స్కూల్ వెనుక రోడ్లు, పీఅండ్‌టీ కాలనీ, ఇందిరా నాయక్ నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, అరుణోదయ నగర్, శాంతినగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్, ఉడా కాలనీ ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళలో ప్రయాణం ఓ సాహసంగా మారుతుంది.

ఆకతాయిలు.. మందుబాబులకు అడ్డా..

వీధిలైట్లు సరిగా వెలగకపోవడంతో పలు కూడళ్లు ఆకతాయిలకు ఆవాసాలుగా మారుతున్నాయి. చీకటి పడితే చాలు ఇక్కడ గుంపులుగా చేరి ఆటుగా రాకపోకలు సాగించే విద్యార్థినులు, మహిళలను అసభ్యకరంగా మాట్లాడుతున్నారు. మరికొన్ని ప్రదేశాలలో మందుబాబులు నడిరోడ్డని లేకుండా అక్కడే తిష్టవేసి దర్జాగా మద్యం సేవిస్తున్నారు. మద్యం మత్తులో వారు అక్కడే గొడవలకు దిగుతుండడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

వరదల తరువాత వదిలేశారు..

బుడమేరు వరదలు వచ్చి వెళ్లిన తరువాత వీధిలైట్ల మరమ్మతులపై సంబంధిత అధికారులు సరిగా దృష్టిసారించడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. తమ వీధుల్లో వీధి లైట్లు వెలగడం లేదని, రోడ్లపై చీకటి అలుముకొని ఉంటుందని సంబంధిత సిబ్బంది, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెలగని వీధిలైట్ల వల్ల స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వాటన్నింటికి మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.



చిన్నపిల్లలు భయపడుతున్నారు..



పాయకాపురం, శాంతినగర్ పరిసర ప్రాంతాల్లో వీధి లైట్లు సరిగా వెలగడం లేదు. రాత్రులు, తెల్లవారుజాము సమయాలలో చిన్నపిల్లలు ట్యూషన్లకు వెళ్లి వచ్చేందుకు రోడ్లపై నడవాలంటే చాలా భయపడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు వెలగని వీధిలైట్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నాం.

– బల్లం కిషోర్, శాంతినగర్

చాలా లైట్లు వెలగడం లేదు..




సింగ్‌నగర్ లూనాసెంటర్, లెనిన్‌సెంటర్, నార్త్‌జోన్ తహసీల్దార్ కార్యాలయం రోడ్లలో వీధిలైట్లు సరిగా వెలగడం లేదు. ప్రధానంగా వరద ముంపు తరువాత ఈ సమస్య అధికంగా ఉంది. రాత్రుల సమయంలో రాకపోకలు సాగిస్తుంటే చీకటిలో నుంచి వీధికుక్కలు బైకుల పైకి ఎగబడుతున్నాయి. వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– జోసఫ్, సింగ్‌నగర్

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలను నిత్యం పరిష్కరించే దిశగా అధికారులు నిరంతరం కృషి చేయాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో నగరవాసుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను స్వయంగా అధికారుకు విన్నవించుకునే ఈ కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకూడదని చెప్పారు. మౌలిక వసతుల కల్పనలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొత్తం 10 ఫిర్యాదులు వచ్చాయి. డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఇన్‌చార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత గొప్పవరం



ఆధ్యాత్మికవేత్త సుబ్బారావు

విజయవాడ కల్చరల్: భగవద్గీత మానవాళికి అందిన గొప్పవరమని ఆధ్యాత్మికవేత్త పొక్కులూరి సుబ్బారావు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో 18 రోజులపాటు నిర్వహించే భగవద్గీత ప్రవచన కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. సుబ్బారావు మాట్లాడుతూ భగవద్గీత వ్యక్తిత్వ వికాస గ్రంథమని తెలిపారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ లలితా రమాదేవి మాట్లాడుతూ భగవద్గీత మన గీతను మారుస్తుందని తెలిపారు. సుబ్బారావును టీటీడీ అధికారులు సత్కరించారు.

హెచ్‌ఐవీ సోకిన వారిని ఆదరించాలి

జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి



మాట్లాడుతున్న డాక్టర్ జూపూడి ఉషారాణి

మధురానగర్(విజయవాడసెంట్రల్): హెచ్‌ఐవీ సోకిన వారిని ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకొని సోమవారం దుర్గాపురం హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన నిరుపేద, హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హెచ్‌ఐవీ సోకిన వారికి ఏఆర్‌టీ చికిత్సతో పాటు పౌష్టికాహారం ఇవ్వటం ద్వారా వారి జీవన ప్రమాణం పెంచవచ్చన్నారు. క్రమం తప్పకుండా హెచ్‌ఐవీ బాధితులు, నిరుపేదలకు పౌష్టికాహారం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని తోటివారికి సాయం చేయాలని సూచించారు. ఏఆర్టీ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ గౌతం అంబేడ్కర్, డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ హెచ్‌ఐవీ సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడటంతో పాటు మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు. ఏ అనారోగ్య సమస్యలు తలెత్తినా సమీపంలోని ఆరోగ్యకేంద్రంలో సంప్రదించాలన్నారు. ట్రస్ట్ సభ్యులు కోరంగి నాగమల్లిక, షఫీ, ఫణిప్రసాద్, హేమంతరావు, రహీమా, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, కొండాయగుంట రాము ఏఆర్టీ సెంటర్ కౌన్సిలర్ కనకాల వరప్రసాద్, ఎం. భాస్కరరావు, స్టాఫ్ నర్సు గండ్రపు దీప్తి, మేరుగ ప్రీతి, బత్తుల సునీత, గాయత్రి పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ



కోర్సు పూర్తిచేసిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, జానకి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యాన రసాయన శాస్త్ర ప్రాముఖ్యతపై అతిథి ఉపన్యాసం జరిగింది. కార్యక్రమంలో రావులపాలెం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపన్యాసం ఇచ్చారు. ప్రస్తుత కాలంలో రసాయన వినియోగం పెరిగిందని వాటిని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వివిధ రకాల పరిశ్రమలు, రసాయనాల తయారీ, ఫార్మా రంగం, ఇన్‌ఫర్మ్యాటిక్స్, ఎలక్ట్రానిక్స్, నానో టెక్నాలజీ, వ్యవసాయరంగం, వైద్యరంగాల్లో విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. కళాశాలలో కంప్యూటేషనల్ కెమిస్ట్రీ సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసిన 25 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కోర్సు సమన్వయకర్త ఎస్‌ఎల్.జానకి మాట్లాడుతూ ఈ కోర్సు పూర్తిచేసిన వారికి బయో ఇన్‌ఫర్మ్యాటిక్స్, కెమ్‌ఇన్‌ఫర్మ్యాటిక్స్ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్ బీబీ, డీ ఎస్ ప్రియదర్శిని, కె.సురేష్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లాది విష్ణు



ధాన్యం పరిశీలించి.. రైతులతో మాట్లాడుతున్న మల్లాది విష్ణు, వైఎస్సార్‌సీపీ నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఏర్పాట్లు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆరోపించారు. కుందావారి కండ్రికలో కల్లాలు, రహదారులపై నిల్వ ఉంచిన ధాన్యాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా రైతులకు ప్రభుత్వం నుంచి సరైన భరోసా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం చెప్పేది ఒకటి.. క్షేత్రస్థాయిలో జరుగుతోంది మరొకటని మండిపడ్డారు. రైతు భరోసా కేంద్రాలన్నీ నిర్వీర్యం అయ్యాయని దుయ్యబట్టారు. ఈ ప్రాంత రైతులు 1061, 1262, 1318, 1224 రకాల వరిని సాగుచేయగా.. రైస్ మిల్లర్లు 1061 రకం తప్ప మిగతా వాటిని కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తామని చెప్పడంతోనే రైతులు ఈ రకాలను పండించారని.. ఇప్పుడు కొనుగోలు చేయకపోవడం అన్నదాతలను ఇబ్బందులకు గురిచేయడం కాదా..? అని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే.. మంత్రులు మాత్రం వాట్సాప్‌లో సందేశాన్ని పంపితే చాలు ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతుండటం హాస్యాస్పదమన్నారు.

తేమ పేరుతో తొండాట..

ఆరుగాలం పండించిన పంట రోడ్లపై ఉంటే అధికారులు మాత్రం తేమ పేరుతో వంకలు చెబుతూ.. రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మల్లాది విష్ణు మండిపడ్డారు. గత ప్రభుత్వంలో తేమ 26 నుంచి 30 శాతం ఉన్నా ధాన్యం కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం ధాన్యాన్ని 17 నుంచి 22 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని చెప్పడం దారుణమన్నారు. చివరకు తెలుగుదేశం ప్రజాప్రతినిధులే డీఆర్సీ సమావేశంలో రైతాంగ సమస్యలపై గళం విప్పుతున్న పరిస్థితి చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పామర్తి వెంకయ్య, నల్లమోతు బుజ్జయ్య, చెన్ని శ్రీనివాసరావు, మున్నంగి శ్రీనివాసరెడ్డి, పిన్నిబోయిన సుబ్బారావు, కొండా పాపారావు, శేఖర్, నాని, రైతులు ఉన్నారు.

మరో 11 రోజుల పాటు అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్తిక మాసం ముగిసినప్పటికీ మాలధారులకు మరో 11 రోజులు భక్తులు, దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు పసుపుతోట శ్రీదత్తసాయి మందిరం వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు తెలిపారు. స్థానిక మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో సోమవారం కార్తిక మాసోత్సవాలలో భాగంగా స్వాములు, భవానీ మాలధారులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాములు, భవానీల కోరిక మేరకు మరో 11 రోజులు మాలధారులకు అన్నప్రసాద వితరణ కొనసాగుతుందని తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణకు 'అంబాసిడర్లు'

- సమాచారం ఇచ్చి.. సమస్య పరిష్కారానికి సహకరించడమే వారి విధి
- ట్రాఫిక్ అంబాసిడర్‌ల సమావేశంలో పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు



ట్రాఫిక్ అంబాసిడర్‌ల సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: నగరంలో రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించే దిశగా పోలీస్ కమిషనరేట్ చర్యలు తీసుకుంటుందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు అన్నారు. ఇప్పటికే వినూత్నంగా లైవ్ డ్రోన్ కెమెరాలు, అస్త్రం యాప్ ద్వారా ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు. అయితే జంక్షన్స్ వద్ద త్వరితగతిన ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు, రవాణా సులభతరం చేసేందుకు స్థానిక వ్యక్తులను ట్రాఫిక్ అంబాసిడర్‌లుగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బెంజిసర్కిల్ సమీపంలోని జ్యోతి కన్వెన్షన్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రాఫిక్ అంబాసిడర్‌లకు కమిషనర్ దిశానిర్దేశం చేశారు.

ట్రాఫిక్ అంబాసిడర్లు వీరే..

నగరంలో నివసించే పలు వృత్తుల వారిని వారి అనుమతితోనే ట్రాఫిక్ అంబాసిడర్‌లుగా తీసుకున్నామని సీపీ చెప్పారు. వారి మొబైల్ నంబర్‌లతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామని, ఈ వాట్సాప్ గ్రూప్ కమాండ్ కంట్రోల్ రూంనకు అనుసంధానమై ఉంటుందన్నారు.

అంబాసిడర్లు ఏం చేస్తారంటే..

ట్రాఫిక్ స్తంభించినపుడు ఫొటో తీసి పంపాలని, లేదంటే మెసేజ్ చేయాలని అంబాసిడర్‌లకు సీపీ సూచించారు. ఏదైనా వాహనం బ్రేక్ డౌన్ అయినా.. రోడ్డు ప్రమాదం జరిగినా, ధర్నా, ర్యాలీ, ఊరేగింపులు, ప్రకృతి వైపరీత్యాలు జరిగినపుడు స్పందించి వెంటనే వాట్సాప్‌లో సమాచారం పంపితే.. అందుబాటులో ఉన్న సంబంధిత ట్రాఫిక్ అధికారులను అప్రమత్తం చేసి, సత్వరమే ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగించి ప్రజలకు కలిగిన అసౌకర్యాన్ని నివారిస్తామన్నారు. అత్యవసర చికిత్స అవసరమైన వారి ప్రాణాలు కాపాడటంలో, అత్యవసర పని మీద వెళ్లేవారు సకాలంలో వారి గమ్యస్థానాలకు చేరుకోవడానికి సామాజిక బాధ్యతగా సాయమందించాలని అంబాసిడర్‌లను కోరారు. చిన్న సమాచారం ఇచ్చి ట్రాఫిక్ అంతరాయం లేని నగరంగా విజయవాడను తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీసీపీలు గౌతమీ సాలి, కృష్ణమూర్తినాయుడు, తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీలు ఎ.వి.ఎల్.ప్రసన్న కుమార్, జి.రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

మాట తప్పిన కూటమి ప్రభుత్వం



విద్యుత్ బిల్లులను చూపుతున్న బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నేడు సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై తీవ్ర భారాన్ని మోపి మాట తప్పిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. సింగ్‌నగర్ 58వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సీపీఎం నాయకులతో కలిసి సోమవారం ఆయన పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి ఈ నెల వచ్చిన విద్యుత్ బిల్లులను పరిశీలించారు. పెరిగిన విద్యుత్ బిల్లులు, మాట తప్పిన ప్రభుత్వ తీరును, అదానీతో కుమ్మక్కైన పాలకుల కుట్రలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు తిరగకముందే రూ.15,484 కోట్ల మేర విద్యుత్ భారాన్ని ప్రజలపై వేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల బిల్లులలో 10 శాతం నుంచి 30 శాతం వరకు బిల్లులు పెరగడంతో నిరుపేదలపై మరింత భారం పడిందన్నారు. సింగ్‌నగర్‌లోని లింగం వెంకటలక్ష్మికి మొత్తం రూ.958 బిల్లు రాగా, అందులో రూ.282లను 2022-23 సర్దుబాటు చార్జీ పేరిట మోపారని వివరించారు. విద్యుత్ చార్జీలు 30 శాతం ఉండగా సర్దుబాటు చార్జీలు, అదనపు చార్జీలు 70 శాతం ఉండటం దారుణమన్నారు. సీపీఎం నాయకులు బి.రమణరావు, కె.దుర్గారావు, సి.హెచ్.శ్రీనివాస్, నిజాముద్దీన్, మూర్తి పాల్గొన్నారు.





పోలి కాంతులు.. ఆధ్యాత్మిక సౌరభాలు



సూర్యోదయ వేళ కృష్ణమ్మ కార్తిక దీపకాంతులతో మెరిసిపోయింది. నారికేళ పంచామృత అభిషేకాలతో శివయ్య పొంగిపోయాడు. లక్ష బిల్వదళ అర్చనలతో మురిసిపోయాడు. ఆలయాలు భక్తజనంతో నిండుగా కనిపించాయి. అంతటా ఓంకార మంత్రం ప్రతిధ్వనించింది. లయకారుడి ప్రీతిపాత్రమైన కార్తిక మాసం చివరి రోజు సోమవారం జిల్లాలోని శైవాలయాలు శశిశేఖరుని నామ స్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామునే భక్తులు కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి దీపారాధనలు చేశారు. విజయవాడ దుర్గా ఘాట్లో దీపాలు వదులుతున్న భక్తులను చిత్రాలలో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

భక్తిశ్రద్ధలతో 'పోలి' పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో సోమవారం తెల్లవారుజామున పోలి పాడ్యమి పూజలు ఘనంగా జరిగాయి. మహిళలు తెల్లవారుజామున ఏలూరు కాలువ, రైవస్ కాలువల వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు చేసి కాలువలలో అరటి డొప్పలలో దీపాలను వదిలారు. అలాగే మధురానగర్ ఏలూరు రైవస్ కాలువ పక్కనే ఉన్న శ్రీ ఉభయ రామలింగేశ్వరస్వామివారి దేవాలయం, ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి దీపారాధనలు నిర్వహించారు.